ప్రపంచ ఇంధన భద్రత!

ఒపెక్ అంటే.. ద ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్(ఓపీఈసీ). ఇది 1960లో బాగ్దాద్‌లో జరిగిన సదస్సులో ఏర్పాటైంది. ఒపెక్ వ్యవస్థాపక సభ్య దేశాలు... ఇరాన్, ఇరాక్, కువైట్, సౌదీ అరేబియా, వెనుజువెలా. సభ్య దేశాల్లో చమురును అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశం సౌదీ అరేబియా! ఒపెక్ యేతర దేశాల్లో... చమురును అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం రష్యా!!

- ఒపెక్ 1960లో ఏర్పాటైంది.
- ప్రపంచ చమురు అవసరాల్లో ఒపెక్ సరఫరా వాటా 40 శాతం.
- రోజుకు ప్రపంచ చమురు డిమాండ్ 80 మిలియన్ల బ్యారెళ్లు.
- ఒపెక్ యేతర దేశాల్లో చమురును అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం రష్యా.

ఒపెక్‌లో ఇరాన్, ఇరాక్, కువైట్, సౌదీ అరేబియా, వెనుజువెలా, కతార్, ఇండోనేషియా, లిబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అల్జీరియా, నైజీరియాలకు సభ్యత్వం ఉంది. మొత్తం సభ్య దేశాల్లో అత్యధికంగా చమురును ఉత్పత్తి చేస్తున్న సౌదీ అరేబియాదే నిర్ణయాత్మక పాత్ర.

ఒపెక్ వాటా 40 శాతం:

ప్రపంచ అవసరాల్లో ఒపెక్ 40 శాతం చమురును సరఫరా చేస్తోంది. మొత్తం చమురు నిల్వల్లో 75 శాతం నిల్వలు ఈ దేశాల్లోనే ఉన్నాయి. ఇరాక్‌ను మినహాయిస్తే... ఒపెక్ దేశాలు ప్రతిరోజూ 28.7 మిలియన్ బ్యారెళ్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయితే, ప్రపంచ డిమాండ్ రోజుకు 80 మిలియన్ బ్యారెళ్లుగా ఉండటం గమనార్హం.

చమురు ధరలు:

చమురు ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఒపెక్ దేశాలు ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలను తమ నియంత్రణలోకి తెచ్చుకుంటున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ధరలు తక్కువగా ఉన్నాయని ఒపెక్ భావించినప్పుడు.. సభ్య దేశాల పెట్రోలియం మంత్రులు సమావేశమై.. ఉత్పత్తిపై గరిష్ఠ పరిమితి(సీలింగ్)ని ప్రకటిస్తున్నారు. దాంతో సరఫరా తగ్గి, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నాయి. చమురు ఉత్పత్తిపై ఒపెక్ పరిమితి కారణంగా... 1973లో ఒక్క రోజులోనే పెట్రోలియం ధరలు నాలుగురెట్లు పెరిగాయి.

చమురు ఉత్పత్తిపై పరిమితికి సంబంధించి ఒపెక్ సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయంలేదు. కొన్ని దేశాలు ఉత్పత్తిని బాగా నియంత్రించి, ధరల పెంపును ప్రతిపాదిస్తే... మరికొన్ని దేశాలు ఉత్పత్తిని పెంచి, ధరలు తగ్గించాలని పేర్కొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు హఠాత్తుగా పెరగడం.. ఒపెక్ దేశాల పరిమితులను తేటతెల్లం చేసింది. ఉత్పత్తిని పెంచి, ధరల స్థిరీకరణకు తోడ్పడటం అటుంచి.. పలు సభ్య దేశాలు తమ కోటాలను కూడా భర్తీ చేయలేకపోతున్నాయి.

ఒపెక్ యేతర దేశాలు:

ఒపెక్ సభ్యదేశాలు కాని రష్యా, మెక్సికో, అంగోలా, ఒమన్, నార్వే, బ్రిటన్‌లలోనూ చమురు ఉత్పత్తుల నిల్వలు భారీగానే ఉన్నాయి.

గరిష్ఠ ఉత్పత్తిదారు రష్యా :

1997 నుంచి రష్యాలో చమురు ఉత్పత్తి ఊపందుకుంది. అదేస్థాయిలో ఆ దేశం నుంచి చమురు ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రపంచ చమురు మార్కెట్‌లో ఒపెక్ యేతర దేశాల వాటా కూడా పెరగడం ప్రారంభమైంది. ఒపెక్ యేతర దేశాల్లో .. రష్యా అత్యధికంగా చమురు ఉత్పత్తి చేస్తోంది.

పెరుగుతున్న ధరలు:

గత కొన్నేళ్లుగా చమురు ధరలు స్థిరంగా పెరుగుతున్నాయి. 2002లో ముడి చమురు ధర బ్యారెల్‌కు సగటున 21.74 డాలర్లుగా ఉంటే.. అది 2007లో 72 డాలర్లకు చేరుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల కాలంలో చమురు ధరలు గణనీయంగా పెరగడానికి ప్రధాన కారణం అమెరికా, చైనాల్లో వినియోగం అధికమవడం. వేగంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్న చైనాలో.. చమురు వినియోగం అధికమవడం తో పెట్రో ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

బలహీన డాలర్:

చమురు ధరలకు బెంచ్‌మార్క్‌గా ఉన్న డాలర్... కొద్దికాలంగా బలహీనమవుతోంది. డాలర్ విలువ పడిపోవడం, దాని కొనుగోలు శక్తిని బాగా తగ్గించింది. మరోవైపు ఒపెక్ దేశాలు తమ ఆదాయాలను డాలర్ విలువతోనే పరిగణనలోకి తీసుకుంటాయి. దాంతో ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలపై ఒపెక్ దేశాలు నింపాదిగా స్పందిస్తున్నాయి.

స్పెక్యులేషన్:

చమురు ధరలు పెరగడానికి మరో కారణం... పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా 2007లో చమురు ఉత్పత్తులను పెంచడానికి ఒపెక్

దేశాలు అంగీకరించకపోవడం. మార్కెట్‌లో భారీ స్పెక్యులేషన్స్ కూడా చమురు ధరల పెరుగుదలకు దోహదం చేసిందని నిపుణులు అంటున్నారు. పెన్షన్, హెడ్జ్ ఫండ్స్ నుంచి పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడటం కూడా చమురు ధరలు చుక్కలనంటడానికి కారణమనే అభిప్రాయమూ ఉంది.

ఇరాన్- ఇరాక్:

అణు కార్యక్రమానికి సంబంధించి అమెరికాతో ఇరాన్ ఘర్షణ తెలిసిందే. అమెరికాతో వివాదం కారణంగా ఇరాన్ నుంచి చమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. చమురు నిల్వలు గణనీయంగా ఉన్న ఇరాన్ నుంచి సరఫరా ఆగిపోతే... భవిష్యత్తులో చమురు ధరలు మరింతగా పెరుగుతాయనే ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది.యుద్ధం, అంతర్గత ఘర్షణలు, ఆంక్షలు, పెట్టుబడులు పడిపోవడం తదితర కారణాలవల్ల ఇరాక్‌లో ఉత్పత్తి అనుకున్న స్థాయిలో లేదు. నైజీరియాలో ఆయిల్ పరిశ్రమపై ఉగ్రవాదుల దాడుల కారణంగా.. 2006, ఫిబ్రవరి నుంచి ఆ దేశం చమురు ఉత్పత్తుల్లో కోతపడింది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం:

చమురు ధరల పెరుగుదల ప్రపంచంలోని పలు దేశాల్లో ద్రవ్యోల్బణానికి దారితీస్తోంది. చమురు ధరల కారణంగా ప్రభుత్వ సబ్సిడీలు, అప్పులు పెరగక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని.. ఇది వడ్డీ రేట్లపై ఒత్తిడి పెంచి, వడ్డీ రేట్లు తగ్గేలా చేస్తుందని ఆర్థిక వేత్తలు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే ఉత్పాదక రంగాలకు పెట్టుబడులు అందుబాటులో లేకుండా పోతాయని వారు అభిప్రాయపడుతున్నారు. చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణానికి దారితీసి, అంతిమంగా ఆర్థిక ప్రగతి కుంటుపడేలా చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న దేశాల్లో జీడీపీ రేట్లను ప్రపంచ బ్యాంకు ఇప్పటికే సమీక్షించింది. ఆయా దేశాల్లో ఒక్కో శాతం మేర ఆర్థిక రేటును తగ్గించింది. 1970, 1980లలో చమురు సంక్షోభంతో పోల్చుకుంటే... ప్రస్తుత పరిస్థితిని పూర్తిస్థాయి సంక్షోభంగా భావించనవసరంలేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఎందుకంటే... 1979తో పోల్చుకుంటే అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పుడు చమురు సరఫరాలపై తక్కువ ఆధారపడుతున్నాయి. ఇరాన్ విప్లవం తర్వాతి సంవత్సరం 1980లో చమురు ధర బ్యారెల్‌కు 101.70 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం ఆ స్థితి లేకపోవడం కూడా పరిస్థితి సజావుగానే ఉందనటానికి నిదర్శనమని వారు అంటున్నారు.

ధరల స్థిరీకరణ ఒపెక్‌కే మేలు:

అమెరికా, ఇంకా ఇతర దేశాల నుంచి చమురు ఉత్పత్తిని పెంచమంటూ ఒత్తిడి వస్తున్నప్పటికీ... ఒపెక్ దేశాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో వియన్నాలో జరిగిన సమావేశంలో ఉత్పత్తిని ప్రస్తుత పంథాలోనే రోజుకు 30 మిలియన్ బ్యారెల్స్‌కు మించరాదని నిర్ణయించాయి. ధరల పెరుగుదల దీర్ఘకాలిక కారణాల వల్ల అంటే.. సరఫరా, డిమాండ్‌ల మధ్య సమతుల్యతవల్ల మాత్రమే ప్రభావితం అవుతాయని విశ్లేషకులు చెబుతున్నారు.